క్లుప్తంగా

ఉపాధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించండి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీపీ బుజ్జి

ఏలేశ్వరం: ఉపాధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీపీ గొల్లపల్లి సూచించారు. మర్రివీడు గ్రామంలో మంగళవారం ఉపాధి పనులను ఎంపీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అవకతవకలు లేకుండా చూడాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డులు ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు వంద రోజుల పని దినాలు కల్పించాలన్నారు. ఉపాధి కూలీలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఓలపల్లి శ్రీకాంత్, ఉపాధి కూలీలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సూర్యకుమారి

ఏలేశ్వరం: బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి సూచించారు. జె.అన్నవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసంలో భాగంగా బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహల నిరోధంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడే వారికి పోక్స్ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. చదువుపై ఏకాగ్రత కలిగి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. లైగింపు వేధింపులకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నీతి కథల అభ్యసనంతో మంచి నడవడిక



కిర్లంపూడి గ్రంథాలయంలో కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

కిర్లంపూడి: నీతి కథలను చదవడంతో పాటు, వాటి అర్థాలను, వాటిలో దాగి ఉన్న నీతిని గ్రహించాలని కిర్లంపూడి లైబ్రరియన్ డి.మరిడి బాబు అన్నారు. వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆయన విద్యార్థులకు నీతి కథలను వినిపించారు. అనంతరం వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులతో పాటు, పాఠకులు ఉన్నారు.

అమ్మను మించిన దైవం లేదు



ఏలేశ్వరం గ్రంథాలయంలో మాట్లాడుతున్న చక్రవర్తి

ఏలేశ్వరం: అమ్మను మించిన దైవం లేదని లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ అన్నారు. గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. పట్టణంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో పిఠాపురానికి చెందిన ఎస్.చక్రవర్తి అమ్మ ఔన్నత్యంతో పాటు అమ్మపాటలు పాడి వినిపించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు తల్లిదండ్రులపై భక్తిభావంతో ఉండాలన్నారు. తల్లిదండ్రులను మించిన గురువులు లేరన్నారు. అనంతరం కథలు చదువుట, రాయుట, పద్యాలు చదివి భావాలు చెప్పడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి



కోడిపందేల్లో పట్టుకున్న వారితో ఎస్సై పవన్‌కుమార్

గోకవరం:మల్లవరం గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేలపై ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 14 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 10 బైక్‌లు, ఆరు కోడిపుంజులు, నాలుగు కోడికత్తులు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు.

వెదజల్లు.. లాభాలు ఫుల్లు

- వరిసాగులో వెదజల్లు పద్ధతితో అధిక దిగుబడి
- పెట్టుబడి ఖర్చు ఆదా
- తగ్గనున్న సాగునీటి వినియోగం
- పరిమిత స్థాయిలో ఎరువులు, పురుగుమందుల వాడకం



కోటనందూరులో వెదజల్లు పద్ధతిలో వరి విత్తనాలు చల్లిన పొలం (ఫైల్)

కోటనందూరు: వరిసాగులో వెదజల్లు విధానంతో ఎన్నో లాభాలు ఉన్నాయి. తక్కువ సాగునీటితో అధిక దిగుబడి సాధించాలన్నా, కూలీలు, ఎరువులు, పురుగుమందుల సమస్యను అధిగమించాలన్నా ఈ పద్ధతే వెదజల్లు విధానం మేలైంది. రైతులు ఆ దిశగా అడుగులేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఈ విధానంలో నారుతీత, నాట్లు, ఖర్చు ఉండకపోగా విత్తనాలు, కూలీల ఖర్చు తక్కువగా ఉంటుంది. తెగుళ్లు, ఎలుకల బెడద కూడా తక్కువుగా ఉండి ఎకరాకు రూ.10 వేల వరకూ పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. సాధారణ విధానం కన్నా ఈ విధానంలో ఎకరాకు ఐదారు బస్తాల దిగుబడి సైతం అధికంగా వస్తుంది. ఇప్పటికే రైతుసేవా కేంద్రాల్లో వ్యవసాయాధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి వెదజల్లు పద్ధతిలో వరిసాగుపై అవగాహన కల్పిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

ఈ ఏడాది తుని సబ్ డివిజన్ పరిధి ఐదు మండలాల్లో రైతులు 40 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తారని వ్యవసాయాధికారుల అంచనా. రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో వ్యవసాయాధికారులు వరిలో వెదజల్లు పద్ధతిపై రైతులకు విరివిగా అవగాహన కల్పిస్తున్నారు. ఖరీఫ్ ఆలస్యం కావడం వల్ల రబీలో సాగు చేసే అపరాల సాగులో కూడా జాప్యం జరిగి తీవ్ర నష్టం వాటిల్లుతున్న దుస్థితిని అధిగమించాలంటే వెదజల్లు విధానం మంచిదని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. సాగునీటి వసతి లేని రైతులు, తక్కువ పెట్టుబడితో మంచి ఫలితాలు సాధించాలనుకునే రైతులు వెదజల్లు విధానం వైపు అడుగులేయాలని సూచిస్తున్నారు.

సాగు విధానం ఇలా..

వేసవి దుక్కి చేసిన పొలంలో ఎదిగిన గడ్డి, పిచ్చిమొక్కలను దమ్ములో కలియదున్ని వారం రోజులు ఉంచితే పొలం సారవంతమవుతుంది. ఇలా దుక్కు చేసిన పొలాన్ని సమాంతరంగా తయారు చేసి నాటడానికి 24 గంటల ముందు వరి విత్తనాలు నానబెట్టి చిన్నగా మొలకెత్తిన తరువాత ప్రతి రెండు మీటర్లకు కాలి బాట ఉండే విధంగా విత్తనాలు చల్లుకోవాలి. విత్తనాలు దూరంగా నాటడం వల్ల గాలి, వెలుతురు అధికంగా ఉండి విత్తనాలు చల్లిన 15 రోజుల తరువాత పంట ఆశాజనకంగా ఎదుగుతుంది. అయితే పంటతో పాటు కలుపు మొక్కలు కూడా సమాంతరంగా ఎదిగే అవకాశం ఉంటుంది.

కలుపు నివారణ

విత్తనం వేసిన తరువాత రోజే పొలంలో కలుపు మందు పిచికారీ చేసుకోవాలి. విత్తనం వేసిన మూడు రోజుల తరువాత 'సాతి' అనే కలుపు మందును మరోసారి స్ప్రే చేసుకోవాలి. వారం తరువాత 'టాప్‌స్టార్' అనే కలుపు మందును ఇంకొకసారి వాడుకోవాలి. విత్తనాలు చల్లిన 15 నుంచి 20 రోజుల తరువాత కలుపు నివారణకు ఎకరాకు 80 నుంచి 100 గ్రాముల పైరజోసల్ఫ్యూరాన్‌ఇథైల్ పిచికారీ చేయడం, ఎకరాకు 30–35 గ్రాములు ఆక్సాడ్‌యార్జిల్ 20 కేజీల ఇసుకలో కలిపి చల్లుకోడం ద్వారా కలుపును పూర్తిగా నివారించవచ్చు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి

సాధారణ విధానంలో ఎకరాకు 30 నుంచి 35 కేజీల వరి విత్తనాలు చల్లాల్సి ఉండగా ఈ విధానంలో 10–12 కేజీలు చల్లితే సరిపోతుంది. ఈ విధానంలో నారుమడి తయారీ, నారుతీత, నాట్లు వేసే ఖర్చు ఉండదు. కాలిబాటలు ఉండే విధంగా విత్తనాలు చల్లడం వల్ల గాలి, వెలుతురు మెండుగా ఉండి పంట భారీగా ఎదిగి ఎకరాకు ఐదారు బస్తాల వరకూ అధిక దిగుబడి వస్తుంది.

ఎరువులు, పురుగుమందుల వినియోగం తక్కువ

ఈ విధానంలో ఎరువులు, పురుగుమందుల యజమాన్యం కీలకం కానున్నాయి. వ్యవసాయధికారుల సిఫార్సుల మేరకు మాత్రమే ఎరువులు వాడాలి. ఈ విధానంలో పంట ఆశాజనకంగా ఎదుగుతుంది. కాబట్టి అధిక మోతాదులో ఎరువులు వాడితే పంట ఇంకా ఎక్కువ ఎదిగి కింద పడిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ప్రధాన, కాంప్లెక్స్ ఎరువుల వినియోగం వ్యవసాయాధికారుల సూచనల మేరకు మాత్రమే వినియోగిస్తే మంచి ఫలితాలు వస్తాయి. గాలి, వెలుతురు అధికంగా ఉండడంతో తెగుళ్లు, ఎలుకల బెడద కూడా తక్కువగా ఉంటుంది.

కూలిరేట్లు భరించలేకపోతున్నాం



రోజురోజుకూ వ్యవసాయ కూలి రేట్లు భారీగా పెరిగిపోతున్నాయి. అదీ అవసరానికి కూలీలు రావడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగు చేయాలంటే భయపడాల్సి వస్తోంది. వ్యవసాయాధికారుల సూచనల మేరకు రెండేళ్లగా వెదజల్లు పద్ధతిలో వరి సాగు చేశాను. తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు వచ్చాయి. పెట్టుబడి భారీగా తగ్గి, కూలీల సమస్యకు పరిష్కారం దొరికింది.

– అంకంరెడ్డి నారాయణమూర్తి, రైతు, అల్లిపూడి

వెదజల్లు విధానం లాభదాయకం



వెదజల్లు పద్ధతిలో పెట్టుబడి తక్కువగా ఉంటుంది. నారుమళ్ల తయారీ, నారుతీత, నాట్లు ఖర్చు ఉండదు. కూలీలు, సాగునీటి వినియోగం, తెగుళ్ల బెడద తక్కువగా ఉంటాయి. వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులు పురుగుమందులు వాడితే సాధారణం కన్నా అధిక దిగుబడి వస్తుంది. పంటకు ఆరుతడి సరిపోతుంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు వెదజల్లు వైపు అడుగులేస్తే లాభదాయకంగా ఉంటుంది.

– కేజే చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి, కోటనందూరు

తాడేపల్లిలో సజ్జలను కలిసిన తోట నరసింహం



తాడేపల్లిలో సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన తోట నరసింహం

జగ్గంపేట: తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు ఆఫీసులో పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసినట్టు మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జీ తోట నరసింహం తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, పార్టీ అభివృద్ధికి చేపట్టిన చర్యలు గురించి ఆయనకు వివరించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో తోట తనయుడు తోట రాంజీ పాల్గొన్నారు.

బాలికల చేతిలో గోరింటాకుతో హెల్ప్‌లైన్ నంబర్లు



రాజపూడి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న సీడీపీఓ పూర్ణిమ

జగ్గంపేట: కిశోర బాలికలు తమకు రక్షణగా ఉండే హెల్ప్‌లైన్ల నంబర్లు గుర్తుపెట్టుకోవాలని, అవసరం వచ్చినపుడు వాటిని సద్వినియోగం చేసుకోవాలని జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ అన్నారు. జగ్గంపేట మండలం రాజపూడి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి బాలికల అవగాహన, శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కిశోరి బాలికల చేతిలో గోరింటాకుతో వారికి రక్షణ కల్పించే హెల్ప్‌లైన్లు నంబర్లు చైల్డ్ హెల్ప్‌లైను 1098, విమెన్ హెల్ప్ లైన్ 181, పోలీస్ హెల్ప్ లైను 100 నంబర్లను వినూత్నంగా రాయించారు.వాటిని కిషోరి బాలికలు గుర్తు పెట్టుకునేందుకు ఈ విధంగా చేసినట్టు తెలిపారు. మహిళా పోలీసు జి.లోవ, సూపర్‌వైజర్ అమ్మాజీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

సైనికుల సేవలు మరువలేనివి



తునిలో ఆపరేషన్ సిందూర్ జవాన్లకు మద్దతు ప్రకటిస్తున్న పౌరులు

తుని: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా అలుపెరగని పోరాటం చేసిన సైనికుల సేవలు మరువలేనివని స్థానిక రోటరీక్లబ్ అధ్యక్షుడు సీహెచ్ మంగరాజు అన్నారు. తుని పట్టణంలో మంగళవారం ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలు కోల్పోయిన వీరజవాన్లు, పోరాటానికి సిద్ధంగా ఉన్న జవాన్లకు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు. రాజా గ్రౌండ్స్ నుంచి ధనలక్ష్మిజ్యువెల్లరీ, గొల్లప్పారావు సెంటర్, రామాథియేటర్ మీదుగా సాగిన ఈ ర్యాలీలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, డాక్టర్లు, న్యాయవాదులు, సమాజ సేవకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అంతకు ముందు యుద్ధంలో అమరులైన జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి వీర్రాజు, ట్రెజరర్ కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కి మద్దతుగా చండీహోమం



రామచంద్రపురంలో చండీహోమం చేస్తున్న సర్పంచ్ సాయిగుణశేఖర్ తదితరులు

కిర్లంపూడి: భారత్ శత్రు దేశానికి బుద్ధి చెప్పడంలో భాగంగా నిర్వహిస్తున్న ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా రామచంద్రపురంలోని రాజరాజేశ్వరీ ఆలయంలో సర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణశేఖర్ మంగళవారం చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోఆర్డినేటర్ తుమ్మలపల్లి రమేష్ ఆదేశాలతో శత్రు దేశం పాకిస్తాన్ ఉగ్ర మూఖలపై పోరాటం చేస్తున్న జవాన్‌లకు, భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి మరింత శక్తి చేకూరాలని గ్రామంలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

సందడిగా నర్సుల దినోత్సవం



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో స్టాఫ్ నర్సును సత్కరిస్తున్న వైద్యులు

ప్రత్తిపాడు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో మంగళవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని సందడిగా నిర్వహించారు. సీహెచ్‌సీ సూపరిటెండెంట్ డాక్టర్ బి.సౌమ్య మైఖేల్ కేక్ కట్ చేశారు. సీహెచ్‌సీ వైద్య సిబ్బంది నైటింగేల్ చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూపరింటిండెంట్ సౌమ్య మైఖేల్ మాట్లాడుతూ రోగులపై ప్రేమాభిమానాలు చూపాలని అన్నారు. రోగి ఏ వ్యాధితో ఆస్పత్రికి వచ్చినా వారి విన్నపాలు ముందుగా వినాలని చెప్పారు. రోగులకు వైద్య సేవలు అందించడంలో వైద్యుని కంటే నర్సుల పాత్ర కీలకమన్నారు. నర్సుల సేవల మూలంగా ప్రత్తిపాడు సీహెచ్‌సీ వైద్య సేవల రంగంలో రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందన్నారు. అనంతరం నర్సులందరినీ ఆమె సత్కరించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యులు కన్యాకుమారి, వినయ్, రఘురామ్, శ్వేత, హెడ్ నర్స్ ఎస్‌కే బేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీ

గండేపల్లి: రామేశంపేటలోని ప్రైవేటు హాస్టళ్లను సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్సైలు యూవీ శివనాగబాబు, రఘునాథరావు, సతీష్, మౌనిక సిబ్బంది మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థుల ప్రవర్తన, మత్తు పదార్థాలు, పానీయాలు తదితర అంశాలపై ఈ తనిఖీ నిర్వహించినట్టు తెలియజేశారు. హాస్టళ్ల నిర్వాహకులు, యజమానులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చినట్టు పేర్కొన్నారు. హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. హాస్టల్స్ చుట్టు పక్కల, కళాశాలకు వెళ్లే మార్గంలోను ఈవ్ టీజింగ్, అనుమానితుల కదలికలపై ఉంటే 9440796529, 9440904841, 9440904834, 9440796569 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

- ప్రత్తిపాడులో మే 20 సమ్మె పోస్టర్ ఆవిష్కరణ
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జి



ప్రత్తిపాడులో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శేషుబాబ్జి

ప్రత్తిపాడు: కార్మికుల హక్కులను కాలరాస్తూ మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జి డిమాండ్ చేశారు. స్థానిక ఉషోదయ పార్కు ఆవరణలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల సమావేశం జరిగింది. మే 20వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జి సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటి నుంచి పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాలను కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో రూ. 26 వేల కనీస వేతనం ఇవ్వాలని, కానీ రోజుకు రూ.178 ఇస్తే సరిపోతుందా అని కేంద్ర ప్రభుత్వం అనడం అన్యాయమని అన్నారు. ఎంపీలకు నెల వేతనం రూ.4 లక్షల చెల్లిస్తుండగా కార్మికులకు చాలీచాలని జీతాలు ఏమిటని ప్రశ్నించారు. శ్రామికుల శ్రమను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకే మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందని విమర్శించారు. అసంఘటిత కార్మికులకు పని భద్రత కల్పించాలనే డిమాండ్ల సాధన కోసం మే 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జి కోరారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, స్కీమ్ వర్కర్స్ సంఘాల నాయకులు అల్లాడ లక్ష్మి, హేమలత, సత్య, నాగలక్ష్మి, కె సతీష్‌కుమార్, ఎం మణికంఠ, అనంతలక్ష్మి, సత్యవతి, సుబ్బలక్ష్మి, రాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



సీహెచ్ అగ్రహారం అగ్ని బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీస్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు

తుని రూరల్: దొండవాక శివారు సీహెచ్ అగ్రహారంలో ఇటీవల గ్యాస్ సిలెండర్ పేలడంతో జరిగిన అగ్నిప్రమాదంలో రెండిళ్లు దగ్ధమై నిరాసులైన కుటుంబాలకు శ్రీస్ఫూర్తి ఫౌండేషన్ రూ.రెండు లక్షలు ఆర్థిక సాయం అందించింది. బృందావనం రాజు తన ఇన్‌స్టాగ్రాం ద్వారా సేకరించిన రూ.1.90లక్షలకు శ్రీస్ఫూర్తి ఫౌండేషన్ సహాయ నిధి నుంచి రూ.పది వేలు కలిపి మొత్తం రూ.రెండు లక్షలకు ఆయా కుటుంబాలకు అందించింది. బాధితులు సర్వం కోల్పోవడం విచారకరమని, ధైర్యంగా ఉండాలని దాతలు సూచించారు. రాయల్ మైక్ రమణ, కాకినాడ రాజేష్, ఫౌండేషన్ వ్యవస్థాపకులు నేమాల శ్రీనివాసరావు, ధర్మేష్, షబీర్, తదితరులు పాల్గొన్నారు.

పని చేసిన వారికి పార్టీలో ప్రత్యేక స్థానం

వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



కిర్లంపూడిలో ముద్రగడను కలిసిన సాయిదొర

కిర్లంపూడి: పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక స్థానం ఉంటుందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. కిర్లంపూడిలోని వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ(పీఏసీ) ముద్రగడ పద్మనాభం నివాసంలో గిరిబాబును ఆ నియోజకవర్గంలోని పలువురు నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పూర్తిస్థాయిలో గ్రామ కమిటీల ఏర్పాటుపై వారితో గిరిబాబు చర్చించారు. రౌతులపూడి మండల వైస్ ఎంపీపీ సూరెడ్డి సాయిదొర, తదితరులు ఉన్నారు.

ఘనంగా పుష్పయాగం

కిర్లంపూడి: చిల్లంగిలోని శ్రీనివాసనగర్‌లో ఉన్న భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మంగళవారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు చక్రవర్తుల రాఘురామచార్యులు(రఘు), జగన్నాథచార్యులు స్వామివారిని, అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి విశేషార్చనలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగం కన్నుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు అన్నవరంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ



లక్ష్మీగణపతి, సీతారాములు, లక్ష్మణుడు, హనుమాన్, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న సూరిబాబు దంపతులు, భక్తులు

అన్నవరం: స్థానిక సాయిబాబా మందిరం వద్ద రూ.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణదేవరాయ కాపు ఒంటరి, తెలగ, బలిజ సంక్షేమ భవనంలో బుధవారం లక్ష్మీగణపతి, సీతారాములు, లక్ష్మణ స్వామి, హనుమాన్, శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామివారి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించనున్నారు. పూజల్లో ప్రముఖ వ్యాపార వేత్త వీర్ల సూరిబాబు దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, మాజీ ఎమ్మెల్యేలు వరుపుల సుబ్బారావు, పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం లోక్‌సభ నియోజకవర్గం వైఎస్ఆర్ సీపీ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణం రాజు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు, శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, జనసేన నాయకుడు వరుపుల తమ్మయ్యబాబు హాజరుకానున్నారు. ఈ ప్రతిష్ఠకు సంబంధించి సోమవారం సాయంత్రం విఘ్నేశ్వరపూజతో కార్యక్రమాలు మొదలయ్యాయి. గ్రామ పురోహితులు దేవులపల్లి మూర్తి పంతులు ఆధ్వర్యంలో పూజలు చేస్తున్నారు.

పేదలకు చేరువైన 'ఫ్యామిలీ డాక్టర్'



వేళంగిలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సౌమ్యశ్రీ

శంఖవరం: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు వైద్యం చేరువైందని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. వేళంగి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. కౌమార దశలో ఉన్న యువతుల్లో రక్తహీనత ఉంటే ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. వేసవికాలంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. 50 మంది సాధారణ రోగులు, 10 మంది గర్భిణులు, ఇద్దరు బాలింతలు, 40 మంది మధుమేహ బాధితులు, 30 మంది రక్తపోటుతో బాధపడుతున్న వారికి సేవలు అందించినట్టు వైద్యాధికారి తెలిపారు.

పేద విద్యార్థులకు చేయూత



చెక్కును అందజేస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

తుని: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి అకాంక్షించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఎనుమల కొండబాబు స్మారక పురపాలకసంఘ ఉద్యోగుల విద్యా నిధి నుంచి పదిలో బి.దేవి(564/600), సీహెచ్.రామలక్ష్మి(563/600), బి.రోహిత్ కుమార్ (554/600), కె.వెంకట సాయి(515/600) మార్కులు సాధించిన వీరికి చెక్కులను సీపీ భవనసుందరి అందజేశారు. మున్సిపల్ ఉద్యోగులు నిధి ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత ఇవ్వడం అభినందనీయమన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, కౌన్సిలర్ కర్రి శ్రీదేవి, వి.శ్రీను, మున్సిపల్ ఉద్యోగులు ఎస్.అచ్చుత రాజు, బి.సాల్మన్‌రాజ్, ఆశిష్‌కుమార్, సీతారాం, వల్లీ, సునీత, అఖిల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతుల కాలనీలో విద్యుత్ కష్టాలు

జగ్గంపేట: గ్రామంలోని జ్యోతుల నెహ్రూ కాలనీలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకూ కరెంట్ లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. రాత్రంతా కంటికి నిద్ర లేకుండా గడిపారు. అసలే వేసవి కాలం. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరయ్యారు. దీనితోతోడు రాత్రంతా కరెంట్ లేకపోవడం దోమలతో సహవాసం చేశారు. అంతేకాకుండా మధ్యంలో వచ్చినా కరెంట్ హెచ్చు తగ్గుల వల్ల విద్యుత్ పరికరాలు పేలిపోతాయన్న భయం అందరిలో నెలకొంది. కొన్ని పేస్‌లు లోవేల్టేజి సమస్య నెలకొంది. మంగళవారం మధ్యాహ్నానికి కూడాని కరెంట్ పునరుద్ధరణ సక్రమంగా జరగలేదు. దీంతో ప్రజలు ఆందోళన చెందారు. స్థానిక ఆశీర్వాదకాంప్లెక్స్ వద్ద ఉన్న ట్రాన్స్‌పార్మర్‌లో లోపం వల్ల విద్యుత్ అంతరాయ ఏర్పడిందని ఎలక్ట్రికల్ ఏఈ మాధురి తెలిపారు. అయితే 16 వీధులు కలిగిన జ్యోతుల నెహ్రూ కాలనీకి మరో ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.